క్లుప్తంగా

గోవాలమ్మతల్లి పండగ నేడు



మునగపాకలోని గోవాలమ్మ తల్లి అమ్మవారు

మునగపాక: మండల కేంద్రమైన మునగపాకలో మంగళవారం గోవాలమ్మ తల్లి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రతి అయిదేళ్లకు ఒకసారి నిర్వహించే పండగను ఈ సారి కూడా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు సంఘ అధ్యక్షుడు బొడ్డేడ అప్పలనాయుడు తెలిపారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకోవాలని కోరారు.

ప్రమాదకరంగా కలింగళ్ బ్రిడ్జి




ప్రమాదకరంగా మారిన కలింగళ్ బ్రిడ్జి

ఎస్.రాయవరం : కొరుప్రోలు శివారు పెద్ద చెరువు వద్ద శిథిలావస్థకు చేరుకున్న కలింగళ్ ఫుట్‌పాత్ బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. కొన్నేళ్లుగా ఈ సమస్య ఇలానే ఉన్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. వర్షాల సమయంలో చెరువులో నీటి ప్రవాహం ఉన్నప్పుడు ఈ బ్రిడ్జి చాలా అవసరం. నిత్యం ఈ బ్రిడ్జి మీదుగా రైతులు, వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. కొరుప్రోలు, గెడ్డపాలెం గ్రామాలకు చెందిన వారు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఇకనైనా అధికారులు పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరారు.

జూ.ఎన్టీఆర్ అభిమానుల వితరణ

ఎస్.రాయవరం : గుడివాడ శివారు కొత్తపోలవరం గ్రామంలో ప్రముఖ సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అభిమానులు, ఎన్టీఆర్ అభిమానులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా అన్న సమారాధన జరిపారు. గ్రామంలో ఉపాధి పనులు చేసే వారికి టిఫిన్లు అందజేసి, యలమంచిలి నుంచి పాయకరావుపేట వరకు వరకు రోడ్డు పక్కన సేద తీరే అనాథలకు, వృద్ధులకు భోజనం పంపిణీ చేశారు.

ఊరించిన మేఘాలు



ఆకాశం మేఘావృతమైన దృశ్యం

రాంబిల్లి: భానుడు భగభగలతో సోమవారం మండల వాసులు ఉక్కిరిబిక్కిరయ్యారు. వేడిగాలులకు నానా అవస్థలు పడ్డారు. రోడ్లు సైతం నిర్మానుష్యంగా మారాయి. అయితే సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారింది. ఆకాశం మేఘావృతమైంది. భారీ వర్షం పడుతుందని ఆశించినప్పటికీ వర్షం మాత్రం పడలేదు. వర్షం పడితే వాతావరణం చల్లబడుతుందని అందరూ ఆశించారు. అయితే నిరాశే మిగిలింది.

కూరగాయల ధరలు ఇలా..

కశింకోట : తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం టమాటా, బంగాళా దుంపల ధర పెరిగింది. కిలోకి రూ.10 వంతున పెరిగాయి. గత వారం కిలో టమాటా, బంగాళాదుంప రూ.30 ఉండగా, ఈ వారం కిలో రూ.40కి పెరిగింది. ఉల్లిపాయ రూ.30, బెండకాయ, వంకాయ, దొండకాయ, క్యాబేజి రూ.40, గోరు చిక్కుడు, బీరకాయ, బీట్రూట్, క్యారెట్, క్యాప్సికం, కాకరకాయ రూ.60కి విక్రయాలు సాగాయి.

జబ్బ వాపు వ్యాధిని ఇలా గుర్తించండి



కోటవురట్ల : పాడి పశువులో వచ్చే వ్యాధులను సకాలంలో గుర్తించి తగు నివారణ చర్యలు తీసుకోవడం ద్వారా నష్టం నుండి తప్పించుకోవచ్చని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సింహాద్రప్పుడు తెలిపారు. పశువుల్లో వచ్చే వ్యాధుల నిర్మూలన, పాడి పశువుల పోషణ, సంరక్షణలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే రైతుకు లాభాలు వస్తాయని తెలిపారు. తెల్లజాతి పశువుల్లో ఎక్కువగా వచ్చే జబ్బవాపు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జబ్బ వాపు వ్యాధి తొలకరి చినుకులు పడగానే ఉనికిని చాటుతుంది. ఈ వ్యాధి సాదారణంగా ఆరోగ్యంగా, బలంగా ఉన్న పశువులకు సోకుతుంది. ఉష్ణ ప్రాంతాలు, గాల్లో తేమ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఎక్కువగా ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఓ రకమైన సూక్ష్మజీవి ద్వారా ఈ వ్యాధి సంక్రమిస్తుంది. కలుషితమైన నీరు, ఆహారం ద్వారా తొందరగా వ్యాపిస్తుంది.

వ్యాధి లక్షణాలు ఏంటి?..

జబ్బ, తొడ కండరాలపై వాపు కనిపిస్తుంది. వాపు ఉన్న చోట వేడిగా ఉండి పశువు నొప్పితో బాధ పడుతుంది. ముందు కాళ్ల మధ్య కూడా వాపు వచ్చే అవకాశం ఉంటుంది. వాపు ఉన్నచోట తాకితే కరకరమన్న శబ్దం వస్తుంది. పశువులో ఆకలి మందగించి నీరసించిపోతుంది. జ్వర తీవ్రత 104 నుండి 106 డిగ్రీలకు పెరిగి పశువు చనిపోతుంది. 6 నెలల నుండి 2 ఏళ్ల వయసున్న పశువుకు ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది. వ్యాధి సోకిన చిన్న పశువులు అకస్మాత్తుగా మరణిస్తాయి. ఎక్కువ శాతం వ్యాధిని గమనించక ముందే పశువులు చనిపోతాయి. ఒకటి కంటే ఎక్కువ శరీర భాగాల్లో వాపు వస్తే పశువు 12 నుండి 36 గంటల్లోగా చనిపోతుంది.

నివారించడం ఎలా?..

వర్షాలకు ముందుగానే వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. వ్యాధి సోకిన పశువులను మిగతా పశువుల నుండి వేరు చేయాలి. వ్యాధి వచ్చిన పశువు మలమూత్రాలతో పాటు గడ్డిని కాల్చివేయాలి. చనిపోయిన పశువును సున్నపు గోతిలో వేసి పూడ్చివేయాలి.

చికిత్స ఇలా...

పశువుల్లో వ్యాధి లక్షణాలు కనిపించగానే పశు వైద్యుని సంప్రదించాలి. వ్యాధి సోకిన పశువుకు పెన్సిలిన్, ఇతర యాంటీబయోటిక్ మందులు వేయాలి.

సువర్ణ శోభితం



సోమవారం సాయంత్రం యలమంచిలి పట్టణంలో బంగారు రంగుతో మెరిసిపోతున్న ఆకాశం



ఆకాశంపై ఏర్పడిన ఇంద్ర ధనుస్సు

యలమంచిలి రూరల్: పట్టణంలో సోమవారం సాయంత్రం ఆకాశంలో వర్ణాలు కనువిందు చేశాయి.సాయంత్రం 5 గంటల సమయంలో వాన చినుకులు కురవగా ఆకాశంలో తూర్పు వైపు రెండు ఇంద్ర ధనుస్సులు ఏర్పడ్డాయి. అదే సమయంలో పడమర దిక్కున సువర్ణ శోభిత వర్ణం చూపరులను ఆకట్టుకుని కాసేపు ఆహ్లాదాన్ని పంచింది.మేఘాల చాటుకు చేరిన భానుడు కొత్త కాంతులను ప్రసరించడంతో నింగిపై బంగారు వర్ణం అలముకుంది.

వేసవి శిబిరంలో పుస్తక పఠనం



దిమిలి గ్రంథాలయంలో వేసవి శిబిరంలో విద్యార్థులు

రాంబిల్లి: దిమిలి శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం కొనసాగింది. ఈ సందర్భంగా పుస్తక పఠనంపై లైబ్రేరియన్ ఎస్. శకుంతల అవగాహన కల్పించారు. నీతి కథలు చెప్పారు. అలాగే ఆటలు ఆడించారు. విద్యార్థులు ఉత్సాహంగా ఈ వేసవి శిక్షణలో పాల్గొన్నారు. పలువురు విద్యార్థులు పాటలు పాడారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



చదవడం అంటే మాకిష్టం కార్యక్రమం ప్రారంభిస్తున్న దృశ్యం

మునగపాక: మండలంలోని మంగళవరపుపేటలో సోమవారం మాడుగుల్లో గ్రంథాలయం ఆధ్వర్యంలో 'చదవడం అంటే మాకిష్టం' కార్యక్రమం ప్రారంభమైంది. గ్రంథాలయం వ్యవస్థాపకులు ఏవీఎస్ మూర్తి ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో పిల్లలు సమయాన్ని వృథా చేయకుండా ప్రతి రోజు కథలు చదవడం, రాయడం వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఇలా చేయడం ద్వారా పిల్లల్లో భాషాభివృద్ధి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధ్యక్ష, కార్యదర్శులు భీశెట్టి ధనశ్రీను, యల్లపు సంజీవరావు, గ్రంథాలయాధికారి ఆడారి జగ్గప్పారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు చైర్‌గేమ్

అచ్యుతాపురం : విజ్ఞాన శిబిరాల్లో భాగంగా అచ్యుతాపురం శాఖా గ్రంథాయలంలో సోమవారం విద్యార్థులు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు చైర్ గేమ్ ఆడించి బహుమతులు అందజేశారు. వచ్చే నెల 7వ తేదీ వరకూ ఈ శిబిరం కొనసాగుతుందని లైబ్రేరియన్ కోటేశ్వరరావు తెలిపారు.

సుందరయ్యకు నివాళులు

అచ్యుతాపురం: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి వారోత్సవాల్లో భాగంగా అచ్యుతాపురం మండలంలోని పలు గ్రామాల్లో సుందరయ్య విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. తిమ్మరాజు పేట, ఖాజీపాలెం, జగ్గన్నపేట గ్రామాల్లో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు.

వరి విత్తనాల కోసం రైతుల పేర్లు నమోదు

పాయకరావుపేట : మండలంలో రైతులు వరి విత్తనాలు కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ తెలిపారు. అదే విధంగా పచ్చిరొట్ట విత్తనాలు కావలసిన రైతులు కోసం జీలుగ, జనుము, పిల్లిపెసర 50 శాతం రాయితీ పై సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఆయా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రం వద్ద వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 2024 ఖరీఫ్ పంటకు అవసరమైన వరి విత్తనాలు కోసం ఇండెంటు పంపించడం జరిగిందన్నారు.

ఏపీఆర్జేసీ పరీక్షలో హర్షవర్ధన్ ప్రతిభ



విద్యార్థి హర్షవర్ధన్ దేవిశ్రీప్రసాద్

కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఏపీఆర్జేసీ పరీక్షలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి ఆర్.హర్షవర్ధన్ దేవిశ్రీప్రసాద్ ప్రతిభ చూపాడు. ఏపీఆర్జేసీ ప్రవేశ పరీక్షలో సీఈసీ గ్రూపులో రాష్ట్ర స్థాయిలో 29వ ర్యాంకు సాధించి ప్రభుత్వ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో బీకామ్ చదివేందుకు అర్హత సాధించాడు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ ఏఆర్టీ సుజాత, అధ్యాపకులు హర్షవర్ధన్ దేవిశ్రీప్రసాద్‌ను అభినందించారు. విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని సూచించారు.

గజ్జాలమ్మ ఉత్సవానికి సన్నాహాలు



కన్నూరుపాలెంలో వెలసి ఉన్న గజ్జాలమ్మ వారు



గజ్జాలమ్మ ఆలయం



ఆలయ అలంకరణకు సిద్ధం చేస్తున్న పూలమాలలు

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెం గ్రామంలో ప్రసిద్ధి చెందిన గజ్జాలమ్మ ఉత్సవం మంగళవారం పెద్ద ఎత్తున నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. రెండేళ్లకొకమారు ఇక్కడ అమ్మ వారి ఉత్సవాన్ని నిర్వహించడం అనవాయితీ. ఉత్సవం సందర్భంగా ఆలయాన్ని అందంగా పూలదండలతో అలంకరిస్తామని, అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయని, సాయంత్రం జాతర ఊరేగింపు జరుగుతుందని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. అమ్మ వారి ఆలయం నుంచి గ్రామంలోని సాయిబాబా ఆలయం వరకు విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశారు. ఎన్నికల నిబంధనల దృష్ట్యా సాంస్కృతిక కార్యక్రమాలు ఈసారి ఏర్పాటు చేయలేదన్నారు.

రేపు విద్యుత్‌కు అంతరాయం

పాయకరావుపేట : 22 వ తేదీన (బుధవారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ కె.రాజశేఖర్ అన్నారు. బుధవారం పాయకరావుపేట, కొరుప్రోలు ఫీడర్ నందు చెట్టు కొమ్మలు నరికివేత, విద్యుత్ మరమ్మతులు, 33కేవీ డీపీ నిర్మాణంలో మార్పుల కారణంగా గొడిచెర్ల, సత్యవరం సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. కాగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

జిల్లా కేంద్రంగా కుస్తీ క్రీడను అభివృద్ధి చేస్తా..



మాణిక్యాలరావును శాలువాతో సత్కరిస్తున్న క్రీడాకారులు

అనకాపల్లి : జిల్లాలో ఆసక్తి గల క్రీడాకారులకు రెజ్లింగ్(కుస్తీ) పోటీల్లో పాల్గొనేందుకు త్వరలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని అమెచ్యూర్ రెజ్లింగ్(ఒలింపిక్ వెయిట్ లిఫ్టర్) అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.మాణిక్యాలరావు అన్నారు. స్థానిక గవరపాలెం వి.వి.రమణ రైతు భారతిహాల్లో సోమవారం జిల్లా క్రీడాకారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంగా త్వరలో కుస్తీ పోటీల అసోసియేషన్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వాలు క్రీడాకారులకు ఎంతో ప్రోత్సాహం అందిస్తుందని, విద్యార్థి దశ నుంచి క్రీడలపై ఆసక్తి పెంచుకునేలా దశల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు ఆళ్ల ప్రవీష్ కుమార్, శిలపరశెట్టి బాబి, దొడ్డి సంతోష్, ఎస్.హేమసాయి, గణేష్, హృదయ్, ప్రవల్లిక, సత్యనారాయణ పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కశింకోట : కశింకోటలోని దేవదాయ శాఖకు చెందిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న స్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం వేద పారాయణ నిర్వహించారు. స్వామి వారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యార్థులు ఇష్టపడి చదువుకోవాలి



టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో అల్లాడ సౌజన్య, బల్లా నాగభూషణం

అనకాపల్లి : విద్యార్థి దశ నుంచి కష్టపడి చదవడం కంటే ఇష్టపడి చదవడంతో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని గాజువాక టీఎస్ఆర్, టీబీకె కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ అల్లాడ సౌజన్య అన్నారు. స్థానిక చిన్నరాజుపేట సిద్దార్థా సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 8 మంది విద్యార్థినీ విద్యార్థులకు నగదు ప్రోత్సాహం, సర్టిఫికెట్లు సోమవారం అందజేశారు. విద్యార్థులు సెలవులను వృథా చేయకుండా పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం, సభ్యులు వినకోట నీలేష్‌గుప్తా, రొబ్బి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



ఎన్టీఆర్ కాలనీలో ప్రజలకు సూచనలిస్తున్న హోంగార్డు



పట్టణంలో ప్రజలకు సూచనలిస్తున్న పోలీసు సిబ్బంది

యలమంచిలి రూరల్ : ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో గ్రామాల్లో అల్లర్లు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని యలమంచిలి పట్టణ ఎస్ఐ పాపినాయుడు హెచ్చరించారు. సోమవారం ఆయన పట్టణంలో ప్రధాన వీధుల్లో తిరిగి స్థానిక ప్రజలతో మాట్లాడారు. రాష్ట్రంలో కొన్ని చోట్ల ఎన్నికల అనంతరం హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో ప్రజలంతా సంయమనంతో ఉండాలని, ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని సూచించారు. ఆ తర్వాత పట్టణ పోలీస్ స్టేషన్ సిబ్బంది రాంనగర్, ఏఎస్ఆర్, ఎన్టీఆర్, ఫైర్ ఆఫీస్ కాలనీలు, పాతవీధి, కాకివాని వీధి, ధర్మవరం, ఎర్రవరం, కొత్తపాలెం తదితర గ్రామాల్లో హోంగార్డులు విస్తృతంగా పర్యటించి ప్రజలకు లౌడ్ స్పీకర్‌తో సూచనలిచ్చారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఎలాంటి సంబరాలు, ఊరేగింపులకు అనుమతి లేదని, 144 సెక్షన్ అమలులో ఉన్నందున నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని, శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలంతా పోలీసులకు సహకరించాలని పోలీసు సిబ్బంది కోరారు.

వర్మీకంపోస్టుపై దృష్టి సారించండి



పీఎల్ పురం గ్రామంలో వర్మీకంపోస్టును పరిశీలిస్తున్న ఈవోఆర్డీ

పాయకరావుపేట : గ్రామ కార్యదర్శులు వర్మీకంపోస్టు తయారు, అభివృద్ధిపై దృష్టి సారించాలని ఈవోఆర్డీ సిహెచ్.చంద్రశేఖర్ అన్నారు. చెత్త నుండి సంపద కేంద్రాలను అభివృద్ధి చేయాలన్నారు. మండలంలో గల పీఎల్ పురం, నామవరం గ్రామాలను సోమవారం పర్యటించి గ్రామ కార్యదర్శులకు తగు సూచనలు, సలహాలు అందించారు. వర్మి కంపోస్టు తయారుపై పంచాయితీ సిబ్బంది దృష్టి సారించాలన్నారు. అదే విధంగా గ్రామాల్లో పారిశుధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈవోఆర్డీతో పాటు గ్రామ కార్యదర్శి బీఏబీఎల్ మూర్తి ఉన్నారు.

విద్యార్థులకు భగవద్గీత పై అవగాహన



విద్యార్థులకు పురాణాలను వివరిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు సీతారామమూర్తి

పాయకరావుపేట : ప్రతి విద్యార్థి పాఠ్యాంశాలతో పాటు పురాణేతిహాసాలపై కూడా అవగాహన కలిగి ఉండాలని విశ్రాంత ఉపాధ్యాయులు ఎస్.సీతారామమూర్తి అన్నారు. వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా గ్రంథాలయంలో విద్యార్థులకు భగవద్గీత, రామాయణాలపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి పాఠ్యాంశాలతో పాటు పురాణాలు, భగవద్గీత, రామాయణం వంటి గ్రంథాలను కూడా పఠించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఇంగ్లిష్ బోధన పైన, వందేమాతరం గేయం పైన అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి పుస్తక పఠనం చేయాలన్నారు. విద్యతో పాటు విద్యార్థులకు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని తెలిపారు.

ముమ్మరంగా వేసవి దుక్కులు



కట్టుబోలు సమీపంలో ట్రాక్టర్‌తో దుక్కి చేస్తున్న దృశ్యం

రాంబిల్లి: మండలంలో వేసవి దుక్కులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ట్రాక్టర్ల సాయంతో వేసవి దుక్కులు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి నారుమడులు కోసం దుక్కి చేస్తున్నారు. దీంతో పాటు పచ్చిరొట్ట ఎరువులు వేసేందుకు కూడా దుక్కి పనులు చేస్తున్నారు. ప్రభుత్వం జీలుగ, జనుము, పిల్లిపెసర (పచ్చిరొట్ట) విత్తనాలను 50 శాతం రాయితీ రైతులకు అందజేయనున్నారు. మరో రెండు మూడు రోజుల్లో పచ్చిరొట్ట ఎరువులను పంపిణీ చేయనున్నట్లు ఏవో సి. సుమంత తెలిపారు.

చిత్ర కళా పోటీలతో సృజనాత్మకత



చిత్రలేఖన పోటీల్లో గెలిపొందిన విద్యార్థులతో ఎంఈవో-1 కె.చిట్టిబాబు



విద్యార్థులు

అనకాపల్లి: చిత్ర కళా పోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, భావవ్యక్తీకరణ వెల్లివిరుస్తుందని తద్వారా ప్రతిభకు గుర్తింపు లభిస్తుందని మండల విద్యాశాఖాధికారి-1 కె.చిట్టిబాబు పేర్కొన్నారు. స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో 15 రోజులుగా జరుగుతున్న ఉచిత చిత్రలేఖనం శిక్షణ తరగతులు సోమవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నతనం నుంచి విద్యార్థులకు చిత్రకళలో మెళకువలు శిక్షణ శిబిరంలో నేర్పించడం అభినందనీయమన్నారు. చిత్రకారులు రాజా రవివర్మ, వడ్డాది పాపయ్య, అంట్యాకుల పైడిరాజుల గురించి చిన్నారులు తెలుసుకోవాలని ఆయన సూచించారు. బాల్య దశ నుంచి చిత్రలేఖనం అవవరచుకోవడానికి వీలుగా ప్రభుత్వ విద్యా సంస్థలు సేవలందిస్తున్నాయన్నారు. చిత్ర లేఖనం కొందరికి అభిరుచి అని, అందమైన బొమ్మను చూస్తున్నప్పుడు కలిగే అనుభూతి వేయి వీణల సంగీతంతో సమానమని చెప్పారు. ప్రస్తుత కాలంలో పిల్లలు చదువుతో పాటు ఇతర అభిరుచులపైనా దృష్టి పెట్టాలన్నారు. ఆటలు, నృత్యాలు, కళలపై ఇష్టం పెంచుకోవాలన్నారు. శిక్షణ అనంతరం సీనియర్, జూనియర్ విభాగంలో ఉత్తమ చిత్రాలను గీచిన విద్యార్థులను సర్టిఫికెట్లతో అభినందించారు. గౌరీ గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు, డ్రాయింగ్ సీనియర్ ఉపాధ్యాయుడు బొడ్డేడ సూర్యనారాయణ, గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకులు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, సభ్యులు కాండ్రేగుల సత్యనారాయణ, బొడ్డేడ జగ్గఅప్పారావు, పాల్గొన్నారు.